## ఎల్.పీ రిసార్ట్స్ - చిన్నపెండ్యాల
(డాక్టర్ లక్ష్మిప్రసాద్)





# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 252
పేజీలు : 08 | వెల: రూ.5/-
మంగళవారం
జూలై 08, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




# తిన్నంత అనారోగ్యం

## ఓరుగల్లులో కల్తీ ఆహారం

- విచ్చల విడిగా వెలుస్తున్న హోటళ్లు, రెస్టారెంట్లు
- అనారోగ్యకరమైన నూనెలు, రంగుల వాడకం
- కస్టమర్ల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం
- టాస్క్‌ఫోర్స్ తనిఖీల్లో తేటతెల్లం

వివరాలు 2లో..

చిరుజల్లులు కురుస్తున్నాయని వేడి వేడిగా బయట ఏదైనా తినాలని అనుకుంటున్నారా? అయితే ఒక్కసారి ఆలోచించాల్సిందే! ఎందుకంటే కంటికి ఇంపుగా కనిపించే ఆహార పదార్థాలన్నీ మేలైనవి కావు. సాధారణ హోటళ్లలోనే ఇలాంటి పరిస్థితి అనుకుంటే పొరపడినట్లే. ప్రముఖ రెస్టారెంట్లలోనూ ఇదే దుస్థితి నెలకొంది. తిండి దగ్గర నుంచి వడ్డించే గిన్నెల వరకూ అన్నీ అపరిశుభ్రమేనని ఇటీవల టాస్క్‌ఫోర్స్ తనిఖీల్లో వెల్లడైంది. దనార్జనే లక్ష్యంగా హోటళ్లు, రెస్టారెంట్ల యజమానులు తక్కువ ధరకు లభించే నాసిరకం వంట నూనెలు, రంగులు, కుళ్లిపోయిన ఆహార పదార్థాలు, కాలం చెల్లిన స్పైసెస్ వాడుతున్నట్లున్నట్లు తేల్చి చెప్పారు. ఇవి కస్టమర్ల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. వరంగల్ మహానగరంలో ఆహార కల్తీకి అడ్డూఅదుపు లేకుండా పోతోందని హెచ్చరిస్తున్నారు. కొంత కాలంగా జీడబ్ల్యూఎంసీ, ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు, టాస్క్‌ఫోర్స్ బృందాలు చేపడుతున్న సోదాలతో బడా హోటళ్లలోని డొల్లతనం వెలుగులోకొస్తోంది. దీంతో బయటి ఫుడ్ తినాలంటేనే ఆలోచించాల్సిన పరిస్థితి నెలకొంది.

- వరంగల్ వాయిస్, హనుమకొండ ప్రతినిధి



8లో..



## సైలెన్సర్లు మార్చితే క్రిమినల్ చర్యలు

ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ ప్రభాకర్ రావు

## స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ అడ్రస్ గల్లంతు

- వారికి డిపాజిట్ కూడా దక్కదు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

8లో..



8లో..



## మా జోలికొస్తే నాశనమైపోతావ్

సొంత చెల్లిని కూడా ఓర్వలేని అహంకారం నీది | కేటీఆర్ పై మంత్రి సీతక్క ఫైర్

# తిన్నంత అనారోగ్యం




- ఓరుగల్లులో కల్తీ ఆహారం
- విచ్చల విడిగా వెలుస్తున్న హోటళ్లు, రెస్టారెంట్లు
- అనారోగ్యకరమైన నూనెలు, రంగుల వాడకం
- కస్టమర్ల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం
- టాస్క్‌ఫోర్స్ తనిఖీల్లో తేటతెల్లం

**వరంగల్ వాయిస్, హన్మకొండ ప్రతినిధి :** చికెన్–65, గోంగూర మటన్, రొయ్యల ఫ్రై, చేపల పులుసు... ఆహా, హోటళ్ల మెనూ చూస్తే నోరూరిపోతుంది! వేడి వేడిగా వడ్డిస్తుంటే లొట్టలేయాలనిపిస్తుంది. రంగురంగుల వంటకాలను చూస్తే మాంసం ప్రియుల మనస్సు లాగేయాల్సిందే. కానీ ఆ ఆహారాన్ని తీసుకుంటే ఆరోగ్యం హాంఫటే! కేవలం రోడ్‌సైడ్ ఫుడ్ సెంటర్స్‌లోనే కాదు, పెద్ద పెద్ద అద్దాల భవంతుల్లో నిర్వహిస్తున్న స్టార్ హోటల్స్, రెస్టారెంట్లలోనూ నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదు. వినియోగదారుల ఆరోగ్యం గురించి అస్సలు పట్టించుకోవడం లేదు. వరంగల్‌లో ఇప్పుడు నాణ్యత లేని ఆహారం ప్రజల ఆరోగ్యాన్ని గుల్ల చేస్తోంది. రుచికి ప్రాధాన్యం ఇస్తూ, అనారోగ్యకరమైన నూనెలు, రంగులు, అపరిశుభ్రమైన పద్ధతుల్లో వంటకాలు తయారు చేస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే హోటళ్ల యజమానులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తక్షణమే అధికారులు స్పందించి, నాణ్యత ప్రమాణాలు పాటించని హోటళ్లపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## బయటి తిండి.. ఆరోగ్యానికి చేటు!

నగర జీవితం వేగంగా మారిపోయింది. భార్యాభర్తలు ఇద్దరూ ఉద్యోగం చేస్తే కానీ జీవనం గడవడం కష్టంగా మారింది. ఈ క్రమంలో, ఇంటి వంట కంటే బయటి ఆహారంపైనే కొన్ని కుటుంబాలు ఎక్కువగా ఆధారపడుతున్నాయి. అధికారిక నివేదికల ప్రకారం, వరంగల్ నగర ప్రజలు, పర్యాటకులు, అలాగే వివిధ పనుల నిమిత్తం వరంగల్ వచ్చే దాదాపు 50 శాతం మంది నిత్యం ఏదో ఒక సమయంలో హోటల్ భోజనంపైనే ఆధారపడుతున్నారు. రోడ్డు పక్కన ఉండే బజ్జీల బండి నుంచి స్టార్ హోటళ్ల వరకు, తమ ఆర్థిక స్థోమతను బట్టి నచ్చినవి ఆరగించేస్తున్నారు. పక్కా వెజ్ వంటకాలతో పాటు వివిధ రకాల నాన్‌వెజ్ ఆహారాలను 'ఆహా ఏమి రుచి తినరా మైమరిచి' అంటూ హోటళ్లలో తినే వారు ఎందరో ఉన్నారు. బయటి ఆహారం ఆరోగ్యానికి హానికరం అని తెలిసినా... జిహ్వాచాపల్యం (రుచిపై కోరిక) ఆ ప్రమాదాన్ని గుర్తించకుండా చేస్తోంది. అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు దీర్ఘకాలంలో తీవ్ర ఆరోగ్య సమస్యలకు దారితీసే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## వాస్తవాలు తెలిస్తే వాంతులే...

వరంగల్ నగరంలోని పలు హోటళ్లు కనీస ప్రమాణాలు పాటించకుండా, నాణ్యత లేని మాంసంతో బిర్యానీలు, ఇతర మాంసాహార వంటకాలను తయారు చేసి వడ్డిస్తున్నాయి. అపరిశుభ్ర వాతావరణంలో, తినడానికి పనికిరాని మాంసాన్ని ఉపయోగించి ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. గ్రేటర్ వరంగల్ పరిధిలోని కొన్ని హోటళ్లు, రెస్టారెంట్లలో, రోగాలతో కూడిన గొర్రెలు, పశువుల మాంసాన్ని వంటకాల్లో వినియోగిస్తున్నట్లు వెల్లడైంది. ముఖ్యంగా మాంసాహార పదార్థాలు అత్యంత హానికరంగా మారుతున్నాయి. వారం, పది రోజులు నిల్వ ఉన్న మాంసాన్ని సైతం బిర్యానీ, ఇతర ఆహార పదార్థాలుగా ఉపయోగిస్తున్నారని ఆరోపణలున్నాయి. ఇటీవల నిర్వహించిన తనిఖీల్లో బిర్యానీ తయారీకి వినియోగించే మాంసం కుళ్లిపోయి దుర్వాసన వస్తున్నట్లు గుర్తించారు. సాధారణ హోటళ్లే కాదు... పేరు ప్రఖ్యాతులున్న పెద్ద సంస్థలు విక్రయించే ఆహారంలోనూ సాల్మోనెల్లా, ఈ–కొలి వంటి ప్రమాదకర బ్యాక్టీరియా ఉందని శాస్త్రీయంగా నిర్ధారణ అయింది.

## షాకింగ్ నిజాలు..

హనుమకొండలోని పలు హోటళ్లలో ఫుడ్ సేఫ్టీ అధికారులు ఇటీవల నిర్వహించిన తనిఖీల్లో అనేక విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. డబ్బులకు కక్కుర్తి పడుతున్న హోటల్, రెస్టారెంట్ల యజమానులు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయనే చీకటి కోణాలు బహిర్గతమయ్యాయి. కేవలం లాభాపేక్షతో కొందరు హోటళ్ల యజమానులు పాడైపోయిన మాంసాన్ని విక్రయిస్తున్నట్లు తేలింది. అంతేకాదు, కుళ్లిన మాంసానికి రంగులు అద్ది, వేడివేడిగా వడ్డిస్తున్నారు. వారాల తరబడి నిల్వ చేసిన మాంసాన్ని కూడా వంటకాల్లో ఉపయోగిస్తున్నారు. అంతే కాకుండా ఫుడ్ సేఫ్టీ, టాస్క్ ఫోర్స్ అధికారుల తనిఖీల్లో పాచిపోయిన, పురుగుల పట్టిన ఆహారాన్నే.. మళ్లీ వేడి చేసి వడ్డిస్తున్నారనే విషయం, చెత్తాచెదారం, బొద్దింకలు, ఈగలు, బల్లులతో కూడిన కిచెన్‌లు దర్శనమిచ్చాయి. ఈ అమానుష చర్యలు ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని, సంబంధిత అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



### జాగ్రత్తలు అవసరం

**- డాక్టర్ బైరి వినోద్ రెడ్డి, ఎండీ జనరల్ పిజీషియన్**

మనం నిత్యం తీసుకునే ఆహారం విషయంలో ఎంత జాగ్రత్తగా ఉన్నా, తెలియకుండానే కొన్ని ప్రమాదాలను కొనితెచ్చుకుంటున్నాం. ముఖ్యంగా హోటళ్లు, రెస్టారెంట్ల నుంచి లభించే ఆహార పదార్థాలు రుచికరంగా ఉన్నప్పటికీ, వాటి తయారీ, నిల్వ పద్ధతుల మూలంగా తిన్నోళ్లకు తిన్నంగా అనారోగ్యం అన్నట్లుగా పరిస్థితి మారింది. ఎక్కువ రోజులు నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు, రసాయనాలు కలిపిన ఆహారం తీసుకోవడం వల్ల డయేరియా, అజీర్ణం, అల్సర్లు, మలబద్ధకం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. హోటళ్లలో వంటలకు ఉపయోగించే నూనెను పదేపదే వేడి చేయడం అత్యంత ప్రమాదకరం. ఇలా చేయడం వల్ల నూనెలోని రసాయన సమ్మేళనాలు మారిపోయి, కేన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు దారితీసే అవకాశం ఉంది. రుచి కోసం, ఆకర్షణీయంగా కనిపించేందుకు వాడే రంగులు, అధిక మసాలాలు అల్సర్లు, కేన్సర్‌లకు కారణం అవుతున్నాయి. హోటళ్లు, రెస్టారెంట్ల నుంచి పార్సిల్స్ తీసుకువెళ్లేటప్పుడు ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను విరివిగా ఉపయోగిస్తుంటారు. వేడి ఆహారం ప్లాస్టిక్‌తో కలవడం వల్ల హానికర రసాయనాలు ఆహారంలోకి చేరి ఆరోగ్య సమస్యలను సృష్టిస్తాయి. దీనికి బదులుగా టిఫిన్ బాక్సులు లేదా స్టీలు కంటైనర్లను వాడటం శ్రేయస్కరం.



### ఆరోగ్యంతో చెలగాటం..

**డాక్టర్ నలమాస శ్రీకాంత్, వరల్డ్ కన్స్యూమర్ రైట్స్ నేషనల్ ఫౌండర్/చైర్మన్**

ధనార్జనే ధ్యేయంగా వినియోగదారుల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్న హోటళ్లు, రెస్టారెంట్లతోపాటు ఇతర ఆహార సంబంధిత వ్యాపారులను ఉపేక్షించకూడదు. రోజుల తరబడి ఫ్రిజ్‌లో నిల్వ ఉంచే ఆహార పదార్థాలతో అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయనేది వాస్తవం. ఫుడ్ సేఫ్టీ, మున్సిపల్ అధికారులు, తూనికలు కొలతలు, టాస్క్ ఫోర్స్ అధికారులు సమన్వయంతో కార్యచరణ చేపట్టడం ద్వారానే ఇలాంటి వాటిని కట్టడి చేసే అవకాశాలు ఉంటాయి. ముఖ్యంగా వరంగల్ వంటి మహానగరంలో రోజురోజుకు విచ్చలవిడిగా వెలుస్తున్న హోటళ్లు, రెస్టారెంట్లపై అధికారుల పర్యవేక్షణ కొరవడుతోంది. దీంతో వారు ఇష్టారీతిన వ్యవహరిస్తూ వినియోగదారుల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నారు. తమ వరల్డ్ కన్స్యూమర్ రైట్స్ సంస్థ వరంగల్ ప్రతినిధుల ద్వారా అధికారులను అప్రమత్తం చేస్తూ ఇలాంటి వాటికి అడ్డుకట్ట వేసేందుకు ప్రయత్నిస్తాం. రాష్ట్ర ప్రభుత్వం కూడా దీనిపై సీరియస్‌గా ఒక కార్యాచరణతో తమ వంటి సంస్థలను భాగస్వాములను చేస్తూ ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉంది. వినియోగదారుల పట్ల ఉదాసీనత వైఖరిని తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఉమ్మడి కార్యాచరణను కూడా చేపడతాం.

# అట్టహాసంగా కడియం జన్మదిన వేడుకలు

- నియోజకవర్గంలో అంబరాన్ని అంటిన సంబరాలు

**వరంగల్ వాయిస్, స్టేషన్ ఘనపూర్ :** స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి జన్మదిన వేడుకలు మంగళవారం అంబరాన్ని అంటాయి. స్టేషన్ ఘనపూర్ లో జరిగిన ఈ వేడుకల్లో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారీ కేక్ కట్ చేశారు. అనంతరం గజ మాలతో అలంకరించి వాహనంపై ఊరేగించారు. ఈ సందర్భంగా కడియం శ్రీహరి మాట్లాడుతూ తన పుట్టినరోజు ఎప్పుడో తెలియదన్నారు. అయితే సర్టిఫికెట్ లలో ఉన్న తేదీనే పుట్టినరోజుగా నిర్వహిస్తున్నారన్నారు. లెక్చరర్ ఉన్న తనను పిలిచి ఎన్టీ రామారావు ఎమ్మెల్యే టికెట్ ఇచ్చారని గుర్తు చేశారు. గత 30ఏళ్లుగా స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ప్రజలు నన్ను ఆదరించి ఆశీర్వదిస్తున్నారన్నారు. ఎన్ని జన్మలు ఎత్తినా నియోజకవర్గ ప్రజల ఋణం తీర్చుకోలేనన్నారు. నిజాయితీగా ఉంటేనే గుర్తింపు వస్తుందన్నారు. అందుకు తనే నిదర్శనం అన్నారు. కడియం పుట్టిన రోజు సందర్భంగా జఫర్ ఘడ్ మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో, స్టేషన్ ఘనపూర్ పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన రక్త దాన శిబిరాన్ని ఎంపి డాక్టర్ కడియం కావ్యతో కలిసి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## చెక్కుల పంపిణీ..

జఫర్ ఘడ్ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యతో కలిసి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలంలోని కల్యాణ లక్ష్మి లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా కడియం కావ్యవ మాట్లాడుతూ నియోజకవర్గంలో అవినీతిరహిత పాలన అందించడమే తమ ధ్యేయం అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్, ఎంపీడీవో, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.





# సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి

## ● డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది క్షేత్రస్థాయిలో ప్రజలకు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించడంతో పాటు డ్రై డే ప్రాముఖ్యతను వివరించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఏ.అప్పయ్య ఆదేశించారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పెద్దమ్మగడ్డలో జరుగుతున్న ఫీవర్ సర్వే, డ్రై డే కార్యక్రమాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా దోమల వల్ల వచ్చే వ్యాధులు, నీటి ద్వారా సంక్రమించే వ్యాధులపై సిబ్బంది ప్రజలకు నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలను పరిశీలించారు. డీఎంహెచ్ఓ మాట్లాడుతూ, దోమలు వృద్ధి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. తమ పరిధిలోని పాఠశాలల్లో వైద్య శిబిరాలు నిర్వహించినప్పుడు విద్యార్థులకు వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేతుల శుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై కూడా అవగాహన కల్పించాలని సూచించారు. వర్షాకాలంలో వేడి వేడి ఆహార పదార్థాలు తీసుకోవాలని, జ్వరం వచ్చినట్లయితే సమీపంలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి జ్వర పరీక్షలు చేయించుకోవాలని కోరారు. అనంతరం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రోగులకు అందించే సేవలు, ఎన్సీడీ డ్రగ్స్ పంపిణీ, ల్యాబ్, ఫార్మసీలను తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రం పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, గురువారంఆరోగ్య కేంద్రాల్లో పరిశుభ్రతకు సంబంధించిన కార్యక్రమం నిర్వహించి, అవసరం లేని వస్తువులను తొలగించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ సంజయ్, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆదేశాలకు అనుగుణంగా, జిల్లా మాస్ మీడియా అధికారి వి. అశోక్ రెడ్డి శాయంపేట పట్టణ ఆరోగ్య కేంద్ర పరిధిలోని సుజిత్ నగర్, ఇందిరానగర్‌లో నిర్వహిస్తున్న డ్రై డే కార్యక్రమాలను పరిశీలిస్తూ, ప్రజలకు సీజనల్ వ్యాధుల పట్ల స్థానిక సిబ్బందితో కలిసి అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

# నిరుపేద కుటుంబాన్ని ఆదుకున్న మాజీ కౌన్సిలర్ పూర్ణాచారి



**వరంగల్ వాయిస్, పరకాల:** మానవత్వం తనకు సొంతమని పరకాల పట్టణ 9వ వార్డు మాజీ కౌన్సిలర్ పూర్ణాచారి మరోసారి నిరూపించారు. శాయంపేట మండలం నేరేడుపల్లి గ్రామానికి చెందిన నిరుపేద పద్మశాలి కుటుంబానికి చెందిన స్వర్గం రాజు మృతి చెందగా, ఆయన కుటుంబానికి అండగా నిలిచారు. రాజుకు ఇద్దరు చిన్న పిల్లలు ఉండటం, వారి కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగోలేదని తెలుసుకున్న పూర్ణాచారి మంగళవారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా 50 కిలోల బియ్యంతో పాటు నిత్యావసర సరుకులు, ఆర్థిక సహాయం అందజేసి తన మానవత్వాన్ని చాటుకున్నారు. పూర్ణాచారి చేసిన ఈ సహాయాన్ని నేరేడుపల్లి గ్రామస్తులు అభినందించారు.

# రాజరాజేశ్వర స్వామికి 108 కలశాలతో అభిషేకం

**వరంగల్ వాయిస్, నల్లబెల్లి:** మండలంలోని మేడపల్లి రాంపూర్ గ్రామంలో కొలువైన రాజరాజేశ్వర స్వామికి 108 కలశాలతో అభిషేకం నిర్వహించనున్నట్లు శివ శక్తిపీఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సాంబరాజు గురూజీ మంగళవారం ప్రకటించారు. ఈ ప్రత్యేక కార్యక్రమం ఈనెల 10వ తేదీ గురువారం ఉదయం 11:25 గంటలకు సింహ లగ్న పుష్కరాంత శుభ ముహూర్తంలో ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు. ఉదయం 5 నుంచి 6 గంటల వరకు సుప్రభాత సేవ, ఉదయం 6 నుంచి 8 గంటల వరకు పరివార దేవతలకు (గణపతి, నాగేంద్ర స్వామి, అభయాంజనేయ స్వామి, నవగ్రహ దేవతలకు) అభిషేకాలు, పూజలు, ఉదయం 8 నుంచి 10:30 గంటల వరకు గంగోత్సవం, పుష్కరణి రంగయ్య చెరువు నుంచి 108 కలశాలతో జలం తీసుకొచ్చి స్వామివారికి అభిషేకం, మధ్యాహ్నం 12:30 నుంచి 1:30 గంటల వరకు గురు పూజ, గురు పారాయణం, మధ్యాహ్నం 2:00 గంటల నుంచి మహా అన్నప్రసాద వితరణ ఉంటుందని తెలిపారు. భక్తులు, ప్రజలు పసుపు, కుంకుమ, మంగళహారతులతో విచ్చేసి స్వామివారి దీవెనలు పొందాలని సాంబరాజు గురూజీ విజ్ఞప్తి చేశారు.

# రజితకు రెండు గోల్డ్ మెడల్స్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండకు చెందిన దోపటి రజిత (శ్వేత చౌదరి) కు లా కోర్సులో రెండు గోల్డ్ మెడల్స్ కు ఎంపిక అయ్యారు. కాకతీయ యూనివర్సిటీలో ఎల్ఎ ల్ బీ పూర్తి చేసిన దోపటి రజిత (శ్వేత చౌదరి) అదే కళాశాలలో 2018 సంవత్సరంలో ఎల్ ఎల్ఎం పూర్తి చేశారు. ఆ విద్యా సంవత్సరంకు గాను ఆమె పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందువలన రెండు విభాగాల్లో గోల్డ్ మెడల్స్ కు ఎంపిక చేశారు. సోమవారం హనుమకొండలోని కాకతీయ యూనివర్సిటీలో నిర్వహించిన స్నాతక ఉత్సవాల్లో గవర్నర్ చేతుల మీదుగా రజిత శ్వేతా చౌదరికి ఎల్ఎల్ఎంలో రెండు గోల్డ్ మెడల్స్ ప్రధానం చేశారు . విద్యార్థులు, అధ్యాపకులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

# వనమహోత్సవాన్ని ప్రారంభించిన కార్పొరేటర్ పల్లం పద్మ



**వరంగల్ వాయిస్, కరీమాబాద్:** వరంగల్ తూర్పు నియోజకవర్గం 32వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ పల్లం పద్మ రవి వనమహోత్సవం కార్యక్రమాన్ని ప్రారంభించారు. కరీమాబాద్‌లోని ప్రభుత్వ ఆకారపు వీరలక్ష్మి పాఠశాలలో మొక్కలు నాటి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పద్మ రవి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవంలో ఈ ఏడాది 18 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. "ప్రకృతిని మనం కాపాడితే, ప్రకృతి మనల్ని కాపాడుతుంది" అని ఆమె అన్నారు. ప్రతి ఒక్కరూ తమ నివాసాలలో, కార్యాలయాలలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ తో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.రాజు, ఉపాధ్యాయులు కవిత, శోభారాణి, రాధిక, శ్రీధర్, వాసుదేవ్, విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# చలో ఇందిరా పార్క్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** 9న ఎన్ హెచ్ఎం ఉద్యోగుల సమస్యల పరిష్కార సాధన కోసం హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని ఎన్ హెచ్ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రామ రాజేష్ ఖన్నా మాట్లాడుతూ ఎన్ హెచ్ఎంలో వివిధ బాగాల్లో 78 క్యాడర్స్ ఉద్యోగులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఆల్ క్యాడర్స్ ఉద్యోగుల సమస్యల శాశ్వత పరిష్కారం కొరకు ఆల్ ట్రేడ్ యూనియన్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు జూలై 9న ఉదయం 10 గంటలకు హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద మహాధర్నా జరుగునని, ఈ ధర్నా సందర్భంగా హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి ఇందిరాపార్క్ ర్యాలీ నిర్వహించి అనంతరం ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఉద్యోగుల హక్కుల సాధనకై నిర్వహించే మహాధర్నాలో ఎన్ హెచ్ఎం ఆల్ క్యాడర్స్ ఉద్యోగులందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఎన్ హెచ్ఎం ఆల్ క్యాడర్స్ ఉద్యోగులకు రామ రాజేష్ ఖన్నా పిలుపునిచ్చారు.

# డాక్టరేట్ పొందిన ఉపాధ్యాయులకు అభినందన



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** హనుమకొండలోని ప్రభుత్వ మర్కజి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు నలుగురు డాక్టరేట్ పట్టాలు సాధించడం పాఠశాలకే గర్వకారణమని, విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు జీవీ రామారావు పేర్కొన్నారు. నూతనంగా డాక్టరేట్ పొందిన వారికి, గతంలోనే ఈ గౌరవం అందుకున్న వారికి సోమవారం పాఠశాలలో ఘన సన్మానం జరిగింది. తాజాగా, ఆంగ్ల ఉపాధ్యాయురాలు పద్మావతి కాకతీయ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో తమ డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. ఆమెతో పాటు ఇటీవల డాక్టరేట్ పొందిన తెలుగు భాషోపాధ్యాయులు డాక్టర్ వలస పైడిని, గతంలోనే ఈ గౌరవం అందుకున్న డాక్టర్ కే. వాసు, డాక్టర్ తుపాకుల లింగమూర్తిలను విద్యార్థుల సమక్షంలో ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ, విద్యార్థులు ఇటువంటి ఉపాధ్యాయులను ఆదర్శంగా తీసుకొని, ఇష్టంతో చదువుపై దృష్టి సారించాలని సూచించారు. తమకు నచ్చిన రంగంలో ఉన్నతంగా ఎదిగి, పరిశోధనల వైపు దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ సెక్రటరీ మధుసూదన్ రెడ్డితో పాటు ఉపాధ్యాయులందరూ పాల్గొన్నారు.

# ఎమ్మార్టీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి




**వరంగల్ వాయిస్, నక్కలగుట్ట:** ఎన్పీడీసీఎల్ యూనియన్ ఆఫీసులో, హనుమకొండలోని పల్లా రవీందర్ రెడ్డి భవన్‌లో అత్యవసర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ మాట్లాడుతూ ఎన్పీడీసీఎల్‌లో ఎమ్మార్టీ ఉద్యోగులు, కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎమ్మార్టీలో కిందిస్థాయి పోస్టులు చాలా వరకు ఖాళీగా ఉన్నాయని, వాటి భర్తీ కోసం యాజమాన్యం తక్షణమే దృష్టి సారించాలని ఆయన కోరారు. యూనియన్‌ను బలోపేతం చేయడానికి ప్రతి ఒక్క సభ్యుడు కృషి చేయాలని, కింది స్థాయి నుంచి యూనియన్ బలోపేతం అయితేనే మనుగడ ఉంటుందని ఆయన అన్నారు. క్రమం తప్పకుండా ప్రతి సభ్యుడు తమ సభ్యత్వ రుసుములను చెల్లించాలని శ్రీధర్ విజ్ఞప్తి చేశారు. బుధవారం నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెలో ప్రతి ఒక్క విద్యుత్ ఉద్యోగి పాల్గొని తమ నిరసన తెలియజేసి సమ్మెను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమ్మెలో భాగంగా ఉద్యోగులు తమ విధులను బహిష్కరించి, కార్యాలయ ఆవరణలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసనలు తెలపాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ నీలమ్ ఐలేష్, ఎన్పీడీసీఎల్ అధ్యక్ష, కార్యదర్శులు పి.మహేందర్ రెడ్డి, కె.శ్రీనివాస్, కంపెనీ నాయకులు గంగాధర్, రాష్ట్ర నాయకులు పి.రమేష్, సీహెచ్.నరేందర్ రెడ్డి, తులసి రెడ్డితో పాటు ఎన్పీడీసీఎల్ పరిధిలోని వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
మంగళవారం, జూలై 08, 2025

# ప్రజల గుండెల్లో వైఎస్ఆర్ చిరంజీవి

◆ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



**వరంగల్ వాయిస్, గణపురం:** దివంగత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి ప్రజల గుండెల్లో శాశ్వతంగా జీవించి ఉన్నారని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మంగళవారం గణపురం మండల కేంద్రంలోని సొసైటీ కార్యాలయం ప్రాంగణంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నిర్వహించిన వైఎస్ఆర్ 76వ జయంతి వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాల వేసి, కేక్ కట్ చేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ, "రైతులకు ఉచిత కరెంటు, 108 అత్యవసర ఆపద్బంధు వాహనం, విద్యుత్ ప్రాజెక్టులు (ఉదాహరణకు గణపురం మండలం చెల్పూరు కేటీపీజెన్‌కో) వంటి ఎన్నో గొప్ప సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసి కాంగ్రెస్ పార్టీకి ఆ ఘనతను వైఎస్ఆర్ అందించారు" అని కొనియాడారు. నాడు వైఎస్ఆర్, నేడు రేవంత్ రెడ్డి.. ఇద్దరూ ప్రజలకు గొప్ప కార్యక్రమాలు చేసిన ముఖ్యమంత్రులని ఎమ్మెల్యే సత్యనారాయణరావు పేర్కొన్నారు. అనంతరం, సొసైటీ ప్రాంగణంలో అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే జీఎస్ఆర్ మొక్కలు నాటారు. తదనంతరం, మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో జరిగిన మహిళా శక్తి సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు, మహిళామణుల ఆర్థిక అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ కృషి చేస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో గణపురం, చిల్పూరు పీఏసీఎస్‌ల చైర్మన్లు కే. కుమార్ యాదవ్, జి. సత్తిరెడ్డి, తహసీల్దార్ సత్యనారాయణ స్వామి, ఎంపీడీఓ భాస్కర్, కాంగ్రెస్ నాయకులు రేపాక రాజేందర్, డి.శంకర్, ఎం.శివశంకర్, వి.నారాయణ, వి.అశోక్, వి.కృష్ణ, ఎస్.నాగేశ్వరరావు, చోటే మియా, వి.సుందర్, ఎన్.దేవేందర్, డి.మహేష్, డి.దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్ రాజశేఖర రెడ్డికి ఘన నివాళి



**వరంగల్ వాయిస్, వరంగల్:** వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని 27వ డివిజన్ కొండ పటేల్ కాలనీలో దివంగత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖర రెడ్డి జయంతిని పురస్కరించుకుని నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్ వైఎస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మీసాల ప్రకాష్ మాట్లాడుతూ, కొండా దంపతుల ఆదేశాల మేరకు కొండ పటేల్ కాలనీలో వైఎస్ చిత్రపటానికి నివాళులర్పించినట్లు తెలిపారు. డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాజీవ్ ఆరోగ్యశ్రీ, ఇందిరమ్మ పథకం వంటి ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి పేదల సంక్షేమానికి కృషి చేశారని గుర్తుచేశారు. పేద ప్రజల కోసం అహర్నిశలు కష్టపడ్డ గొప్ప నాయకుడని ఆయన కొనియాడారు. వైఎస్ రాజశేఖర రెడ్డి ఆశయాలను కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని మీసాల ప్రకాష్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు సందెల లాజర్, మహిళా కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షురాలు గూడ శారద, కొండమీది సదనందం, కొండ పటేల్ కాలనీ అధ్యక్షులు దౌడు నాగరాజ్, కమిటీ సభ్యులు శ్యామల మార్క్, ఓడపల్లి రవి, ఏలగొండ శ్రీనివాస్, కొండపర్తి శ్రీలత, ఓరుగంటి రేణుక, రామగిరి శ్రీవిద్య, పొడిశెట్టి సరళ దేవి, రబ్బాని నజియా, స్వరూప తదితరులు పెద్ద ఎత్తున పాల్గొని డాక్టర్ వైఎస్‌కు నివాళులు అర్పించారు.

## ఘనంగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతిని పురస్కరించుకుని మంగళవారం హనుమకొండ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి వైఎస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రాజశేఖర్ రెడ్డి పేద ప్రజల కోసం ఎన్నో సంస్కరణలను అమలు చేశారని గుర్తు చేసుకున్నారు. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, రుణమాఫీ, రైతులకు ఉచిత విద్యుత్తు వంటి పథకాలను ప్రవేశపెట్టి ప్రజల మన్ననలు పొందారని తెలిపారు. నేటి తరం నాయకులకు వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాలన ఒక రోల్ మోడల్ అని అన్నారు. ఉమ్మడి రాష్ట్రవ్యాప్తంగా ఆయన మరణాన్ని జీర్ణించుకోలేని పరిస్థితులు నెలకొన్నాయని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆత్మకూరులో ..




**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి 76వ జయంతి వేడుకలను మంగళవారం ఆత్మకూరులో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు పర్వతగిరి రాజు, నాగిల్లి సామెల్, ఆత్మకూరు పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఏరుకొండ రవీందర్ గౌడ్, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పరికిరాల వాసు, ప్రధాన కార్యదర్శి వెల్ద వెంకటేశ్వర్లు, బరుపట్ల కిరీటి, ప్యాక్స్ డైరెక్టర్ రేవూరి జయపాల్ రెడ్డి, వరంగల్ ఏఎంసీ మాజీ డైరెక్టర్ జిన్న వెంకటరమణారెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తనువుల సందీప్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బయ్య కుమారస్వామి (నెంబర్), మత్స్య పారిశ్రామిక సంఘం చైర్మన్ గుండెబోయిన బిక్షపతి, నాయకులు తాళ్ల కిరణ్, రవి పాల్గొన్నారు.

## వక్కల వెంకటస్వామికి డాక్టరేట్



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** హనుమకొండ జిల్లాలోని నారాయణగిరి గ్రామానికి చెందిన వక్కల వెంకటస్వామికి విశిష్ట గౌరవంగా డాక్టరేట్ అవార్డు లభించింది. గత రెండు దశాబ్దాలకు పైగా నిబద్ధతతో జర్నలిస్టుగా, సంపాదకునిగా పనిచేస్తూ ప్రజల సమస్యలను సమర్ధవంతంగా వెలికి తీస్తూ సామాజిక హితాన్ని లక్ష్యంగా చేసుకుని ఆయన సేవలందిస్తున్నారు. ఆయన నిర్వహిస్తున్న పత్రిక, వార్తా వ్యవస్థలు నిస్వార్థంగా ప్రజల తరపున నిలబడి ధైర్యంగా సమస్యలను వెలికి తీయడంలో ముందుంటున్నాయి. కేవలం జర్నలిజంతోనే కాక, "నా వివేకం" అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించి అనాథలు, వృద్ధులు, వికలాంగులు, నిరుపేదలకు తనవంతుగా సేవలందిస్తున్నారు. వెంకటస్వామి చేసిన ఈ సేవలను గుర్తించి, అమెరికాలోని డెలివేర్ రాష్ట్రానికి చెందిన గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ ఆయనకు గౌరవ డాక్టరేట్ ప్రకటించింది. చెన్నైలోని భారతీయ విద్యా భవన్ వేదికగా జరిగిన కార్యక్రమంలో వివిధ రాష్ట్రాలు, దేశాల నుండి వచ్చిన అతిథుల సమక్షంలో వైస్ ఛాన్సలర్ కే.వెంకటేష్ చేతుల మీదుగా ఈ డాక్టరేట్ అవార్డును అందించారు. వెంకటస్వామి చేసిన సేవలు గ్రామీణ ప్రాంతాలలో ఆదర్శంగా నిలుస్తున్నాయని పలువురు అభినందించారు. ఒక పక్షపాత రహిత ప్రజాప్రతినిధిగా, సామాజిక సేవా పథంలో అగ్రగామిగా ఆయన చేసిన కృషికి గౌరవంగా లభించిన ఈ పురస్కారం ఆయన నిబద్ధతకు నిదర్శనంగా నిలిచిందని అభిప్రాయపడ్డారు.

## రైతులందరూ ఫార్మర్ ఐడీ నమోదు చేసుకోవాలి



**వరంగల్ వాయిస్, మల్హార్:** ఫార్మర్ ఐడీ నమోదును రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కొయ్యూరు క్లస్టర్ ఏఈఓ అనుష సూచించారు. రెవెన్యూ శాఖ వద్ద ఉన్న భూ యాజమాన్య వివరాల ఆధారంగా రైతులకు ఫార్మర్ ఐడీని కేటాయించడం జరుగుతుందని ఆమె తెలిపారు. పీఎం కిసాన్ లబ్ధిదారులకు తదుపరి విడత లబ్ధి పొందుటకు ఫార్మర్ ఐడీ రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని అనుష గుర్తు చేశారు. ఈ మేరకు మండలంలోని కొయ్యూరు రైతు వేదికలో గత కొన్ని రోజులుగా ఫార్మర్ ఐడీ రిజిస్ట్రేషన్ నమోదు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు ఫార్మర్ ఐడీ నమోదు చేసుకోని రైతులు తమ ఆధార్ కార్డు, పట్టా పాసుబుక్కు, ఆధార్‌కు లింక్ చేసిన ఫోన్ నంబర్‌తో వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించాలని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

## ఘనంగా కడియం శ్రీహరి జన్మదిన వేడుకలు



**వరంగల్ వాయిస్, ధర్మసాగర్:** స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ శాసనసభ్యులు, మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి జన్మదిన వేడుకలు ధర్మసాగర్ మండలంలోని తాటికాయల దేవునూరుతో పాటు వివిధ గ్రామాలలో ఘనంగా జరిగాయి. కాంగ్రెస్ పార్టీ మండల గ్రామ శాఖ అధ్యక్షుడు గుర్రపు ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు, కడియం అభిమానుల మధ్య కేక్ కట్ చేసి, అరటి పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల సమన్వయ కమిటీ సభ్యులు, మాజీ సర్పంచులు, ఉప సర్పంచులు, వివిధ గ్రామ శాఖ అధ్యక్షులు, మండల సింగిల్ విండో డైరెక్టర్, మాజీ మార్కెట్ కమిటీ సభ్యులు, మహిళా నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కడియం అభిమానులు, కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై వేడుకలను విజయవంతం చేశారు.

## కస్తూర్బాను సందర్శించిన డీఈఓ జ్ఞానేశ్వర్



**వరంగల్ వాయిస్, పర్వతగిరి:** పర్వతగిరిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని వరంగల్ డీఈఓ మామిడి జ్ఞానేశ్వర్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలోని పలు రికార్డులను, మౌలిక వసతులను పరిశీలించారు. ప్రతి తరగతి గదిని సందర్శించిన డీఈఓ విద్యార్థినులతో మాట్లాడారు. వివిధ సబ్జెక్టులకు సంబంధించిన ప్రశ్నలను అడిగి వారి విజ్ఞాన స్థాయిని పరిశీలించారు. పాఠశాలలో అందిస్తున్న వసతుల గురించి కూడా విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన అనంతరం, పాఠశాల నిర్వహణ పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కస్తూర్బా గాంధీ ఉపాధ్యాయులకు సూచనలు ఇస్తూ, ఈ విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని జ్ఞానేశ్వర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పర్వతగిరి మండల విద్యాశాఖ అధికారి గాయపు లింగారెడ్డి, పర్వతగిరి కాంప్లెక్స్ హెడ్ మాస్టర్ పాక రమేష్ బాబు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం స్పెషల్ ఆఫీసర్ నాజియా సల్మా, సీఆర్పీ భుక్య శ్రీనివాస్, సీసీఓ గారె జయరాజ్ తదితరులు డీఈఓ వెంట పాల్గొన్నారు.

# 20న ఓబీసీల పోరుబాటపై సమీక్ష

**వరంగల్ వాయిస్, హనుమకొండ:** మధ్యప్రదేశ్ ప్రజా ఆరోగ్య, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పరికిపండ్ల నరహరి రచించిన 'ఓబీసీల పోరుబాట' పుస్తకంపై సమీక్ష నిర్వహించాలని రౌండ్ టేబుల్ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. ది వీవర్స్ వెల్ఫేర్ ట్రస్ట్ బోర్డ్ ఆధ్వర్యంలో ట్రస్ట్ బోర్డ్ భవన్‌లో చైర్మన్, వర్ధన్నపేట మాజీ శాసన సభ్యులు వన్నాల శ్రీరాములు అధ్యక్షతన సోమవారం ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వన్నాల శ్రీరాములు మాట్లాడుతూ పరికిపండ్ల నరహరి రచించిన ఈ పుస్తకం బీసీ ఉద్యమానికి ఒక దిక్సూచి అని అభివర్ణించారు. అనాదిగా బీసీలకు జరుగుతున్న అన్యాయాలపై సర్వీసులో ఉన్న ఒక ఐఏఎస్ అధికారి రచన చేయడం అభినందనీయమని వన్నాల అన్నారు. ఈ పుస్తకాన్ని హైదరాబాద్‌లో లాంఛనంగా ఆవిష్కరించినప్పటికీ, దీనిపై విస్తృత సమీక్ష నిర్వహించాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. ఇలాంటి సమీక్షలు నిర్వహించడం ద్వారా బీసీలకు జరుగుతున్న అసమానతలను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లే ప్రయత్నం జరుగుతుందని వన్నాల శ్రీరాములు అభిప్రాయపడ్డారు. రాజ్యాధికారంతోనే బీసీలకు న్యాయం జరుగుతుందని, మరో మార్గం లేదని వన్నాల స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం కుల గణన చేయడానికి ముందుకు వచ్చిందని, తదనంతరం బీసీ రిజర్వేషన్ల వైపు అడుగులు వేస్తుందని వన్నాల ధీమా వ్యక్తం చేశారు. 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందిన మాదిరిగానే, భవిష్యత్తులో బీసీ రిజర్వేషన్ల బిల్లు ఆమోదం లభించడానికి ఉద్యమాల ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలని, అందుకు ఈ పుస్తకం ఎంతో దోహదపడుతుందని వన్నాల అభిప్రాయపడ్డారు. హరిత కాకతీయ హోటల్‌లో ఈనెల 20న 'ఓబీసీల పోరుబాట' పుస్తక సమీక్ష ఏర్పాటు చేస్తున్నట్లు వన్నాల శ్రీరాములు తెలిపారు. ఈ కార్యక్రమానికి రచయిత, సీనియర్ ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి హాజరవుతారని పేర్కొన్నారు. న్యాయవాదులు, డాక్టర్లు, జర్నలిస్టులు, రాజకీయ విశ్లేషకులు, మేధావులు, ఉద్యోగులు, వివిధ బీసీ సంఘాల నాయకులు విధిగా హాజరై కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని వన్నాల కోరారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా ప్రజా పరిషత్ పూర్వ చైర్మన్ సాంబారి సమ్మారావు, చైతన్య యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ గుర్రపు దామోదర్, ది వీవర్స్ వెల్ఫేర్ ట్రస్ట్ బోర్డ్ ప్రధాన కార్యదర్శి దాసరి ప్రేమ్ సాగర్, వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు వలస సుధీర్ కుమార్, హన్మకొండ జిల్లా ప్రజా పరిషత్ వైస్ చైర్మన్ గజ్జెల్లి శ్రీరాములు, అకుట్ పూర్వ అధ్యక్షులు, రాజకీయ విశ్లేషకులు కూరపాటి వెంకట నారాయణ, పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఈగ వెంకటేశ్వర్లు, పరకాల బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వేముల సదారాణి, గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేముల నాగరాజు, వరంగల్ వాయిస్ ఎడిటర్ గడ్డం కేశవ మూర్తి, ఢింబాయ్ టీవీ న్యూస్ సీఈఓ వేముల సదానందం నేత, పద్మశాలి అడ్వకేట్స్ అసోసియేషన్ అధ్యక్షులు గంజి గణేష్, ఫ్రూట్ మార్కెట్ అధ్యక్షులు వెల్డి సాంబయ్య, ట్రస్ట్ బోర్డ్ కోశాధికారి గజ్జెల్లి రవీందర్, డైరక్టర్ ప్రొఫెసర్ వంగరి సూర్యనారాయణ, డాక్టర్ వన్నాల పావని, డాక్టర్ బేతి కవిత, వేముల ఆంజనేయులు, పాము శ్రీనివాస్ పాల్గొన్నారు.



# బీరన్న స్వామి దేవుని గుడి హుండీ కానుకల లెక్కింపు

◆ ఆదాయంగా రూ.45 వేల నగదు, ఆభరణాలు



**వరంగల్ వాయిస్, కరీమాబాద్:** వరంగల్ ఉర్సులోని శ్రీ బీరన్న స్వామి దేవాలయంలో తొలి ఏకాదశి మహా పర్వదినం సందర్భంగా కురుమ కులస్థులు శ్రీ బీరన్న స్వామి దేవుని బోనాల జాతరలో పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు హుండీలో సమర్పించిన కానుకలను చైర్మన్ మరుపల్ల రవి ఆధ్వర్యంలో దేవాలయ ధర్మకర్తల మండలి లెక్కించింది. చైర్మన్ మరుపల్ల రవి మాట్లాడుతూ స్వామివారిని దర్శించుకుని తమ కోరికలు నెరవేరినందుకు భక్తులు నగదు, వస్తు రూపేణా హుండీలో సమర్పించారని తెలిపారు. హుండీలను లెక్కించగా రూ.45,606 నగదు లభించిందని చెప్పారు. అలాగే, అక్క మహాకాళి కామరాతి దేవతలకు తమ కోరికలు నెరవేరినందుకు భక్తులైన గౌడ సంతోష్, సౌమ్య దంపతులు బంగారు పుస్తెలు, మట్టెలను సమర్పించినట్లు వెల్లడించారు. ఉర్సు బీరన్న బోనాల జాతర విజయవంతం కావడానికి అన్ని విధాలా సౌకర్యాలు ఏర్పాటు చేసిన మహానగరపాలక సంస్థ మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ బాజ్ పాయ్‌లకు ధర్మకర్తల మండలి కృతజ్ఞతలు తెలియజేసింది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పెద్ద ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేసిన ఏసీపీ శుభం ప్రకాష్, మిల్స్ కాలనీ సీఐ బొల్లం రమేష్, ఎస్ఐలు శ్రీకాంత్, సురేష్, సాంబయ్యలతో పాటు పోలీస్ సిబ్బందికి కూడా కృతజ్ఞతలు తెలిపారు. కరీమాబాద్ ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్ ఏడీ పాలడుగు చంద్రమౌళి, ఏఈ దేవరాయ సంపత్‌లకు కూడా ధర్మకర్తల మండలి ధన్యవాదాలు పలికింది. హుండీ లెక్కింపులో ధర్మకర్తలు మిర్యాల కుమారస్వామి, మండలా ప్రమీల గౌడ, కోటేశ్వర్, మరుపల్ల గౌతం, పూజారి బలభద్ర భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ఉన్నతికి తల్లిదండ్రుల సహకారం తప్పనిసరి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రభుత్వ ఉన్నత పాఠశాల శివనగర్‌లో ప్రధానోపాధ్యాయులు పూస నరేంద్ర స్వామి అధ్యక్షతన పేరెంట్ టీచర్స్ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన 35వ డివిజన్ కార్పొరేటర్ సోమిశెట్టి ప్రవీణ్ కుమార్, విద్యార్థుల విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల కృషి కూడా అవసరమని తెలిపారు. తల్లిదండ్రులు ఇంటి వద్ద పిల్లలకు క్రమశిక్షణ నేర్పుతూ, ఉపాధ్యాయులు చెప్పిన హోంవర్క్ చేయిస్తూ వారి ఉన్నతికి పాటుపడాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం కల్పిస్తున్న అనేక సౌకర్యాలను ఉపయోగించుకొని విద్యార్థులు ఉన్నత స్థానాలు అధిరోహించాలని ఆయన కోరారు. ప్రధానోపాధ్యాయులు నరేంద్ర స్వామి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో క్వాలిఫైడ్ ఉపాధ్యాయులు ఉంటారని, మంచి నాణ్యమైన విద్యను అందిస్తారని అన్నారు. ప్రైవేట్ పాఠశాలల ప్రచారానికి మోసపోకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చేరి నాణ్యమైన విద్యను అందుకోవాలని విద్యార్థులను కోరారు. చదువే సకల సమస్యలకు ఔషధం లాంటిదని, చదువుకుంటే సమాజంలో మంచి ఉన్నతమైన స్థానంలో ఉంటూ మంచి కుటుంబాన్ని ఏర్పరచుకోవచ్చని, సౌకర్యవంతమైన జీవనం గడపవచ్చని తెలియజేశారు. వరంగల్ జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం పాఠశాలలోని విద్యార్థిని, విద్యార్థులకు స్ఫూర్తి కార్యక్రమం ద్వారా జీవన నైపుణ్యాలు ఎలా అలవర్చుకోవాలి, మంచి జీవనశైలి కొరకు ఎలాంటి అలవాట్లను నేర్చుకొని జీవితంలో ముందుకెళ్లాలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు అంజయ్య, సంపత్‌లు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఏపీసీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయ బృందం తిరుపతి, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, దేవరాజు, అంజయ్య, నరేందర్, సంపత్, ప్రకాష్, స్వప్న, కవిత, సుహాసిని, ధనలక్ష్మి, భవాని, కిరణ్మయి, సందీప్ తో పాటు విద్యార్థిని విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# కార్మికులకు పీపీఈ కిట్ల పంపిణీ



**వరంగల్ వాయిస్, న్యూ శాయంపేట:** గ్రేటర్ వరంగల్ మున్సిపాలిటీ పరిధిలోని 31వ డివిజన్, న్యూ శాయంపేట సర్కిల్‌లో మున్సిపల్ కార్మికులకు వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని మంగళవారం పర్సనల్ ప్రొటెక్టివ్ ఎక్విప్‌మెంట్ (పీపీఈ) కిట్లను స్థానిక కార్పొరేటర్ మామిండ్ల రాజు అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మామిండ్ల రాజు మాట్లాడుతూ కార్మికులు నిత్యం ఎండనక, వాననక అందిస్తున్న సేవలకు వారి ఆరోగ్యం చాలా ముఖ్యమని అన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని, కమిషనర్, మేయర్ ఆదేశాల మేరకు పీపీఈ కిట్లను పంపిణీ చేయడం ఆనందంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనిల్, జవాన్, పవన్, మరియు పలువురు కార్మికులు పాల్గొన్నారు.

# టీచర్ అనిత ఔదార్యం



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో హిందీ బోధిస్తున్న ఉపాధ్యాయురాలు కలపాల అనిత తన ఔదార్యాన్ని చాటుకున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు పాఠశాల గేటు ముందు నీరు చేరి బురదగా మారడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గోడ పక్క నుంచి నడుచుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ సమస్యను గమనించిన అనిత, ట్రాక్టర్ యజమానులతో మాట్లాడి 10 ట్రక్కుల మొరంను పాఠశాల ఆవరణలో పోయించారు. దీంతో బురద సమస్య తొలగిపోయి, విద్యార్థులు సాఫీగా పాఠశాలకు చేరుకోగలుగుతున్నారు. విద్యార్థుల ఇబ్బందులను తొలగించిన ఉపాధ్యాయురాలు అనితను ప్రధానోపాధ్యాయుడు బండి నరసింహారావుతో పాటు తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించి ధన్యవాదాలు తెలిపారు.

# గోడపత్రిక ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, వరంగల్:** మోడీ ప్రభుత్వం 'ఆత్మనిర్భర్ భారత్'లో భాగంగా 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా విభజించి, కార్మికుల న్యాయమైన హక్కులకు తూట్లు పొడుస్తోందని వామపక్ష విద్యార్థి సంఘాలు తీవ్రంగా ఖండించాయి. దీనికి నిరసనగా బుధవారం జరిగే కర్షక, కార్మిక సమ్మెకు మద్దతుగా కాకతీయ యూనివర్సిటీ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం సార్వత్రిక సమ్మె గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్‌ఐ రాష్ట్ర కన్వీనర్ కామగోని శ్రావణ్, ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ మాస్ సావిత్రి, ఏఐడీఎస్ఓ రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మర్రి మహేష్ లు మాట్లాడుతూ, మోడీ ప్రభుత్వం గతంలో ఉన్న కార్మిక, కర్షక చట్టాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తోందని, వాటి అమలును నీరుగార్చి పెట్టుబడిదారీ సామ్రాజ్యవాదులకు అనుకూలంగా 44 కార్మిక చట్టాలను నాలుగు చట్టాలుగా తీసుకువచ్చిందని ఆరోపించారు. వ్యవసాయ రంగంలో అన్నదాతల నడ్డి విరుస్తూ, పెట్టుబడిదారులకు మేలు చేసే విధంగా నూతన చట్టాలను అమలుపరిచే విధానాన్ని వ్యతిరేకిస్తూ 9న దేశవ్యాప్తంగా వామపక్ష పార్టీలు చేపట్టే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థి సంఘాలుగా తాము కూడా ఈ సమ్మెలో పాల్గొని, దాని విజయవంతానికి కృషి చేస్తామని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ జిల్లా కన్వీనర్ ఉప్పుల శివ, ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ అధ్యక్ష కార్యదర్శులు సాయికుమార్, జశ్వంత్, విద్యార్థి నాయకులు ప్రదీప్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# కోటంచ హుండీల ఆదాయం రూ. 10,45,963

## ఆలయ ఈవో ఎస్ మహేష్



**వరంగల్ వాయిస్, రేగొండ:** మండలంలోని కొడవటంచలో ఉన్న సుప్రసిద్ధ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ హుండీల ద్వారా మొత్తం రూ. 10,45,963 ఆదాయం సమకూరిందని ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈవో) ఎస్. మహేష్ తెలిపారు. మంగళవారం శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం, కొడవటంచ గ్రామము నందు స్వామివారికి భక్తులు సమర్పించిన కానుకల హుండీలను విప్పి లెక్కించగా నోట్ల రూపంలో రూ. 9,57,940, నాణేల రూపంలో రూ. 88,023 వచ్చినట్లు ఈవో మహేష్ పేర్కొన్నారు. విదేశీ నోట్లు, వెండి, బంగారు వస్తువులను తిరిగి హుండీలోనే వేసినట్లు తెలిపారు. స్వామివారి ఆలయ హుండీలను ప్రముఖుల సమక్షంలో విప్పి లెక్కించడం జరిగిందన్నారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో పరకాల డివిజన్ దేవాదాయ శాఖ పర్యవేక్షకులు నందం కవిత, ఆలయ ఈవో ఎస్. మహేష్, ఆలయ చైర్మన్ ముల్కనూరి భిక్షపతి, ధర్మకర్తలు ఎం. శ్రీధర్, ఎం. ఓంకార్, ఎ. రమేష్, ఎస్. సుదర్శన్, కె. జోగేందర్, ఇల్లి కళావతి–రవి, బి. మల్లయ్య, కె. సాంబయ్య, ఎం. ఐలయ్య, ఎ. సంపత్ పాల్గొన్నారు. గ్రామ పెద్దలు కె. సంపత్ రావు, డి. శ్యామ్ రావు, ఆలయ పూజారులు, కొడవటంచ భజన బృందం వారు, నిమ్మల రాజు వారి భజన బృందాలు, గ్రామ ప్రజలు కూడా ఈ లెక్కింపులో పాల్గొని సహకరించారు. లెక్కింపు కార్యక్రమంలో భాగంగా ఆలయ సిబ్బంది గోరంట్ల శ్రావణ్, కొమ్రరాజు రవి, సొన్నాయిల సుధాకర్, నాగుల సుదర్శన్, బోసు రవి తదితరులు ఉన్నారు.

# టై, బెల్టు, బ్యాడ్జీల పంపిణీ



**వరంగల్ వాయిస్, వేలేరు :** వరంగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పీచరలో మంగళవారం ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మారబోయిన అనిత – రాజుగౌడ్ దంపతులు విద్యార్థులకు రూ.7,000 విలువ చేసే 85 జతల టైలు, బెల్టులు, బ్యాడ్జీలను బహుకరించారు. రాజుగౌడ్, పీచర పాఠశాల పూర్వ విద్యార్థి కావడం విశేషం. ప్రస్తుతం ఆయన షైన్ జూనియర్ కాలేజీలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి మాట్లాడుతూ, విద్యార్థుల కోసం ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకొని టైలు, బెల్టులు, బ్యాడ్జీలు బహుకరించినందుకు దాతలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలకు దాతల సాయం



**వరంగల్ వాయిస్, కొత్తపేట:** గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా కొత్తపేట ప్రభుత్వ పాఠశాల ప్రాంగణం నీటితో నిండి, బురదమయంగా మారింది. ఈ సమస్యను పరిష్కరించేందుకు పాఠశాల యాజమాన్యం దృష్టికి తీసుకురాగా, దాతల సహాయం కోరడం జరిగింది. పాఠశాల విజ్ఞప్తికి తక్షణమే స్పందించి, మేకల నవీన్ తన సహృదయంతో సుమారు రూ. 7,500 విలువ చేసే ఒక లారీ మొరంను పాఠశాల ప్రాంగణంలో పోయించారు. ఆయన చేసిన ఈ సహాయానికి ప్రభుత్వ పాఠశాల తరఫున ఉపాధ్యాయులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# ఆయిల్ పామ్ విస్తరణ లక్ష్యాలను పూర్తి చేయాలి

## ◆ జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్



**వరంగల్ వాయిస్, ములుగు:** ఆయిల్ పామ్ విస్తరణ లక్ష్యాలను పూర్తి చేయాలని, రైతులు ఆయిల్ పామ్ సాగు ద్వారా పొందే లాభాలపై అవగాహన కల్పించాలని ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన తన ఛాంబర్‌లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సి.హెచ్. మహేందర్ జీతో కలిసి ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం, ప్రాసెసింగ్ ఇండస్ట్రీ (ఫ్యాక్టరీ) నిర్మాణంపై సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్, ఆయిల్ పామ్ పంట సాగు, ఆయిల్ పామ్ కంపెనీ ఫ్యాక్టరీ నిర్మాణం కోసం అవసరమైన డాక్యుమెంట్లు, పర్మిషన్లు, మౌలిక వసతుల కల్పన, కావాల్సిన ఏర్పాట్లపై అధికారులతో వివరంగా చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ, హార్టికల్చర్ సహకార సంఘాల బలోపేతం, రైతుల సౌకర్యార్థం అనేక పథకాలు ప్రవేశపెడుతుందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి డి. సంజీవరావు, జిల్లా వ్యవసాయ అధికారి సురేష్ కుమార్, జిల్లా ఇండస్ట్రీస్ అధికారి సిద్ధార్థ రెడ్డి, డీఈఆర్ డబ్ల్యూఎస్ వెంకట సతీష్, విద్యుత్ శాఖ డీఈ నాగేశ్వరరావు, కే.ఎన్. బయోసైన్స్ ఏరియా మేనేజర్ హేమంత్ కుమార్ రెడ్డి, మైక్రో ఇరిగేషన్ ఇంజనీర్ (ఎంఐఈ) వి. వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మీడియా సంస్థలపై దౌర్జన్యం రాచరికానికి పరాకాష్ట

## ప్రొ. కూరపాటి వెంకటనారాయణ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రజాస్వామ్యంలో మీడియా సంస్థలపై దౌర్జన్యం చేస్తే తెలంగాణ ప్రజలు తగిన బుద్ధి చెబుతారని తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల వేదిక చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ, తొమ్మిది సంవత్సరాల పాటు కుటుంబ నిరంకుశ, కిరాతక రాజరిక పాలన సాగించి, రాష్ట్రాన్ని అన్ని రకాలుగా దోపిడీ చేసుకున్న కేసీఆర్ కుటుంబం దోపిడీ ప్రస్తుతం అనేక దర్యాప్తు సంస్థల ద్వారా నిజాలు ప్రజలకు తెలుస్తున్న సందర్భంలో, మీడియాలో వస్తున్న అంశాలను జీర్ణించుకోలేక మీడియా సంస్థలపై దౌర్జన్యం చేయడం కిరాతకం అన్నారు. ఒకవేళ మీడియా తప్పుడు రాతలు రాస్తే ప్రజాస్వామ్యబద్ధంగా, చట్టబద్ధంగా చర్యలు చేపట్టవచ్చు గానీ, దాడి చేయడం అరాచకం అవుతుందని ప్రొఫెసర్ వెంకటనారాయణ స్పష్టం చేశారు.

# సార్వత్రిక సమ్మెకు సీపీఐ సంపూర్ణ మద్దతు

## రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** సెంట్రల్ ట్రేడ్ యూనియన్లు, స్వతంత్ర సెక్టోరల్ ఫెడరేషన్లు, అసోసియేషన్ల వేదిక ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 9న బుధవారం జరుగుతున్న సార్వత్రిక సమ్మెకు సీపీఐ సంపూర్ణ మద్దతు ఇస్తున్నదని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక, రైతు వ్యతిరేక, దేశ వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలకు నిరసనగా ఈ సమ్మెకు పిలుపునివ్వడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రజాసేవల ప్రైవేటీకరణ, ఔట్ సోర్సింగ్ విధానాలు, కాంట్రాక్టరైజేషన్ విధానాలకు వ్యతిరేకంగా కార్మిక సంఘాలు పోరాడుతున్నాయని తెలిపారు. సంయుక్త కిసాన్ మోర్చా, వ్యవసాయ కార్మిక సంఘాల జాయింట్ ఫ్రంట్ ఈ సమ్మె చర్యకు మద్దతు తెలిపాయని తక్కళ్లపల్లి శ్రీనివాసరావు వెల్లడించారు. కార్మిక సంఘాలు, రైతులు, వ్యవసాయ కార్మికుల డిమాండ్లకు సీపీఐ కట్టుబడి ఉందని, జాతీయ ప్రయోజనాల దృష్ట్యా జూలై 9న దేశవ్యాప్త సమ్మె చర్యను విజయవంతం చేసే కార్యక్రమాలలో పాల్గొనాలని సీపీఐ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు.

# ఘనంగా గోరింటాకు పండుగ



**వరంగల్ వాయిస్, గణపురం:** గణపురంలోని శ్రీ పట్టాభి సీతారామచంద్రస్వామి ఆలయంలో మంగళవారం ఆషాడ శుక్ల త్రయోదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకలో భాగంగా మహిళలందరూ కలిసి ఆలయ ఆవరణంలో గోరింటాకు పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఆషాడ మాసంలో గోరింటాకు పెట్టుకోవడం ఒక సాంప్రదాయంగా వస్తోంది. మహిళలు మాట్లాడుతూ. గోరింటాకు పెట్టుకోవడం స్త్రీలు సౌభాగ్యంగా భావిస్తారని, వివాహమైన స్త్రీలకు వైవాహిక జీవితం సంతోషంగా ఉంటుందని నమ్ముతామని పేర్కొన్నారు. అందుకే ప్రతి ఆషాడ మాసంలో గోరింటాకు పండుగను ఎంతో సాంప్రదాయంగా జరుపుకుంటామని, ప్రతి ఆషాడ మాసంలో మహిళలందరూ గోరింటాకు పండుగను జరుపుకోవాలని కోరారు.

# చదువుకోవడం బాలల హక్కు



**వరంగల్ వాయిస్, కరీమాబాద్:** ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, రంగశాయిపేటలో ప్రధానోపాధ్యాయులు ఊటుకూరి అశోక్ అధ్యక్షతన మంగళవారం మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వరంగల్ జిల్లా సెక్టోరియల్ అధికారి సుభాష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పేరెంట్ టీచర్ మీటింగ్‌ను ఉద్దేశించి సుభాష్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని, క్వాలిఫైడ్ టీచర్లు ఉంటారని, ప్రభుత్వం అనేక రకాల సౌకర్యాలు విద్యార్థులకు కల్పిస్తుందని అన్నారు. నేటి బాలలే రేపటి పౌరులు కాబట్టి తల్లిదండ్రులు ఈ దిశగా ఆలోచించి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని, ప్రతి నెల జరిగే తల్లిదండ్రుల సమావేశానికి తప్పకుండా హాజరుకావాలని ఆయన కోరారు.

# అర్హులైన ప్రతి పేదవారికి ఇందిరమ్మ ఇల్లు

## ● పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి



**వరంగల్ వాయిస్, దామెర:** అర్హులైన ప్రతి పేదవారికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలనే లక్ష్యంతో పనిచేస్తుందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. మంగళవారం దామెర మండల కేంద్రంలోని రైతు వేదికలో మండలంలోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై అధికారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులతో గ్రామాలవారీగా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం నెరవేరాలంటే మంజూరైన ప్రతి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు త్వరగా నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని కోరారు. అధికారులు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గుమ్మడి కల్పన, ఎమ్మార్వో జ్యోతి వరలక్ష్మి దేవి, హౌసింగ్ ఏఈ అకన్య, సీఐ రంజిత్ రావు, ఎస్ఐ కొంక అశోక్, ఇతర అధికారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ వాయిస్
సినిమా
మంగళవారం 08 జూలై 2025
7

# అది మానేశాకే బరువు తగ్గాను

## నటి విద్యాబాలన్ ఆరోగ్య సీక్రెట్



ప్రతి ఒక్క హీరోయిన్ శరీర ఆకృతి విషయంలో చాలా అంటే చాలా జాగ్రత్తలు తీసుకుంటారు. అందంగా కనిపించడం కోసం జిమ్‌లో గంటల తరబడి వర్కౌంట్‌లు చేస్తారు. అయితే బరువు తగ్గాలంటే జిమ్, వ్యాయామం, కఠినమైన డైట్‌లు తప్పనిసరి అన్న భావనకు బాలీవుడ్ నటి విద్యా బాలన్ ఓ కొత్త కోణాన్ని చూపించారు. 46 ఏళ్ల విద్యా ఇటీవల ఓ ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశ మవుతున్నాయి. కెరీర్ ఆరంభం నుంచి తన శరీర తీరుపై విమర్శలు ఎదుర్కొన్న విద్యా, ఎన్నో డైట్‌లు, జిమ్ సెషన్లు –ట్రై చేసినా అవి తాత్కాలిక ఫలితాలే ఇచ్చాయని గుర్తుచేశారు. కానీ ఆమె అసలు మార్పు మాత్రం జిమ్ మానేశాకే వచ్చిందని వెల్లడిరచారు. 'నాకు బరువు పెరగడానికి అసలు కారణం కొవ్వు కాదు. అది ఇన్‌ఫ్లమేషన్ (శరీరంలోని వాపు) అని చెన్నైకి చెందిన 'అమురా' అనే న్యూట్రిషన్ గ్రూప్ చెప్పారు. ఆ సంస్థ సూచించిన విశిష్టమైన డైట్ ప్లాన్ అనుసరించడంతో, బరువు క్రమంగా తగ్గిపోయింది. అంతేకాదు, ఈ డైట్‌తోపాటు– నన్ను ఏడాది పాటు వ్యాయామం చేయొద్దని సూచించారు. నేను వర్కౌట్ చేయకుండా, జిమ్‌కి కూడా వెళ్లకుండా బరువు తగ్గాను. ఇప్పుడు ఎవరైనా నన్ను చూస్తే.. ఎంత స్లిమ్ అయిపోయావ్ అంటు–న్నారు. నేను పాటించిన డైట్ విధానం అందరికీ సరిపోదు. ఒక్కొక్కరి శరీరం ఒక్కోలా ఉంటు–ంది. అందుకే శరీర అవసరాలు గౌరవించాలి' అంటూ తన అనుభవాన్ని పంచుకుంది.



# గుమ్మడి నటనకు ఎవరైనా ఫిదా కావాల్సిందే

## నేడు జయంతి సందర్భంగా సంస్మరణ

చిన్న వయసులోనే బరువైన పాత్రలు పోషించారు. పాజిటివ్, నెగిటివ్ క్యారెక్టర్ ఏదైనా అందులో జీవించాల్సిందే. లీడ్ రోల్ అయినా అతిథి పాత్రైనా.. ఆ సినిమాపై తనదైన ముద్ర వేయాల్సిందే. అతను ఎవరో కాదు గుమ్మడి వెంకటేశ్వర్ రావు. ఏ పాత్ర అయినా అలవోకగా చేసే గుమ్మడి నటన అందరికీ గుర్తుండిపోయింది. ఇవాళ గుమ్మడి జయంతి సందర్భంగా ఆయనను ఓసారి గుర్తు చేసుకుందాం.గుమ్మడి వెంకటేశ్వరరావు 1927 జూలై 9న గుంటూరు జిల్లా తెనాలి తాలూకా రావికంపాడు గ్రామంలో ఓ సాధారణ రైతు కుటుంబంలో జన్మించారు. గుమ్మడి వెంకటేశ్వరరావుకు బాల్యం నుంచీ ఏదో ఒక వైవిధ్యం ప్రదర్శించాలనే తపన ఉండేది.యన్టీఆర్ తమ ఎన్.ఏ.టి. సంస్థ నిర్మించిన చిత్రాలలో మంచి పాత్రలు ఇచ్చి ప్రోత్సహించారు. అలా రామారావు సొంత చిత్రాలు పిచ్చి పుల్లయ్య, తోడుదొంగలు, జయసింహ లో గుమ్మడి కీలక పాత్రలు పోషించారు. ఆ తరువాత గుమ్మడి మరి వెనుదిరిగి చూసుకోలేదు. 'తోడుదొంగలు'లో గుమ్మడి వయసు మీరిన పాత్ర ధరించడం చూసిన పి.పుల్లయ్య తన 'అర్ధాంగి' చిత్రంలో ఏయన్నార్, జగ్గయ్యకు తండ్రిగా నటించే పాత్రను ఇచ్చారు. తన కన్నా వయసులో పెద్దవారయిన నటులకు తండ్రిగా నటించడంతో అప్పటి నుంచీ గుమ్మడికి అధికంగా తండ్రి పాత్రలే పలకరించసాగాయి. అనేక విలక్షణమైన పాత్రల్లో సలక్షణంగా నటించిన గుమ్మడికి 'మహామంత్రి తిమ్మరుసు' చిత్రం ఎనలేని పేరు సంపాదించి పెట్టింది. ఈ చిత్రం ద్వారా ఆయనకు రాష్ట్రపతి బహుమతి కూడా లభించింది. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆయనను 'కళాప్రపూర్ణ' గౌరవ డాక్టరేట్ తో సత్కరించింది. రాష్ట్రప్రభుత్వం 'రఘుపతి వెంకయ్య అవార్డు'తో గౌరవించింది. సాత్వికాభినయంలో తనకు తానే సాటి అనిపించుకున్న గుమ్మడి పేరు తలచుకోగానే ఆయన ధరించిన అనేక వైవిధ్యమైన పాత్రలు మన



కళ్ళ ముందు కదలాడుతూ ఉంటాయి. గుమ్మడి తన చివరి రోజుల్లో చిత్రసీమలో తన అనుభవాలను తీపి జ్ఞాపకాలు– చేదు గుర్తులు' పేరుతో రాసుకున్నారు. 2010 జనవరి 26న గుమ్మడి తుదిశ్వాస విడిచారు. తెలుగు చిత్రసీమ చూసిన మహానటుల్లో గుమ్మడి పేరు శాశ్వతంగా నిలచిపోతుంది. నవతరం ప్రేక్షకులు సైతం గుమ్మడి మెథడ్ యాక్టింగ్ చూసి ముగ్ధులవుతున్నారు..

# బాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్న సాయిపల్లవి

బాలీవుడ్ స్టార్ హీరో ఆమిర్‌ఖాన్ కుమారుడు జునైద్ ఖాన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం ఏక్ దిన్. ఈ సినిమాతో స్టార్ నటి సాయి పల్లవి బాలీవుడ్ ఎంట్రీ– ఇస్తుండగా.. సునీల్ పాండే దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రోడక్షన్ పనుల్లో బిజీగా ఉంది. అయితే ఈ సినిమాను నవంబర్ 7న ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు– చిత్రబృందం ప్రకటించింది. ఈ సినిమాను ఆమిర్‌ఖాన్‌తో పాటు– బాలీవుడ్ అగ్ర నిర్మాత మన్సూర్ ఖాన్ నిర్మిస్తున్నాడు. ఆమిర్‌ఖాన్ – మన్సూర్ ఖాన్ దాదాపు 17 ఏండ్ల తర్వాత ఈ సినిమాతో మళ్లీ కలుస్తున్నారు. వీరిద్దరి కలయికలో 2008లో వచ్చిన 'జానే తూ... యా జానే నా' చిత్రం సూపర్ హిట్‌ను అందుకుంది.





# యూఎస్‌లో అట్లీ, అల్లు అర్జున్ సినిమా

## విలన్‌గా హాలీవుడ్ నటుడు విల్ స్మిత్ అంటూ ప్రచారం

పుష్ప 2 ది రూల్ వంటి బ్లాక్ బస్టర్ తర్వాత అల్లు అర్జున్ ఎలాంటి సినిమా చేస్తున్నాడా అని ఎదురు చూస్తున్న అభిమానులకు బన్నీ సూపర్ అప్‌డేట్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. తమిళ దర్శకుడు అట్లీతో తన తదుపరి సినిమా చేస్తున్నాడు అల్లు అర్జున్. ఈ సినిమాకు సన్ పిక్చర్స్ అధినేత కళానిధి మారన్ నిర్మిస్తుండగా.. అల్లు అర్జున్ 22వ సినిమాగా ఈ చిత్రం తెరకెక్కుతుంది. ఈ మూవీ షూటింగ్ దాదాపు అమెరికాలో జరుపుకోబోతుంది. ఇప్పటికే అల్లు అర్జున్‌తో పాటు దర్శకుడు అట్లీ– చిత్రయూనిట్ మొత్తం అమెరికాకు చేరుకుంది. ఈ సినిమాలో దీపికా పదుకొనే కథానాయికగా నటిస్తుండగా.. విలన్ రోల్‌కి సంబంధించి ఆసక్తికర విషయం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ సినిమాలో హాలీవుడ్ స్టార్ నటుడు విల్ స్మిత్‌ను విలన్‌గా తీసుకుబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఒకవేళ ఇదే నిజమైతే అల్లు అర్జున్ సినిమా పాన్ ఇండియా నుంచి ఇంటర్‌నేషనల్ వరకు వెళుతుంది. కాగా ఈ విషయంపై చిత్రబృందం నుంచి ప్రకటన రావాల్సి ఉంది. ఈ చిత్రంలో అల్లు అర్జున్ మూడు విభిన్న పాత్రల్లో కనిపించనున్నారని సమాచారం.



# మా జోలికొస్తే నాశనమైపోతావ్

- సొంత చెల్లిని కూడా ఓర్వలేని అహంకారం నీది
- కేటీఆర్ పై మంత్రి సీతక్క ఫైర్

**వరంగల్ వాయిస్, ములుగు :** సమ్మక్క–సారక్క వారసులం.. మా జోలికొస్తే నాశనమైపోతావ్ అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ఫైర్ అయ్యారు. సొంత చెల్లెలిని కూడా ఓర్చలేని అహంకారం నీదన్నారు. నిజంగా నీకు ఆడబిడ్డల మీద గౌరవముంటే నా మీద ఈ దాడులు జరిగేవి కావన్నారు. ములుగు జిల్లా కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి సీతక్క కేటీఆర్ పై తీవ్రవ్యాఖ్యలు చేశారు. తాను ఆదివాసి మహిళనని చూడకుండా కావాలని రాజకీయ దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. 70 ఏళ్ల చరిత్రలో తొలిసారి కోయ వర్గానికి మంత్రి పదవి లభించిందని, అదే తనకు ఓ బాధ్యతగా భావించి ములుగు అభివృద్ధికి కృషి చేస్తున్నానని సీతక్క తెలిపారు. నేను ఎలాంటి తప్పు చేసినా, అసెంబ్లీలో చర్చ పెట్టి నిలదీయండన్నారు. అంతేకాని పక్క నియోజకవర్గాల నుంచి ప్రజలను తీసుకొచ్చి రోడ్లమీద ధర్నాలు చేయిస్తే ఇక్కడి ప్రజలు చూస్తూ ఊరుకుంటారా అన్ని ప్రశ్నించారు. ములుగులో ఇప్పుడు ప్రజారాజ్యం నడుస్తోందన్నారు. ఇదే నిజమైన ఇందిరమ్మ పాలన అని ఆమె తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోయిన తర్వాత అభివృద్ధిని ఓర్చలేక తప్పుడు ఆరోపణలు చేస్తున్నదని విమర్శించారు. మీ ప్రభుత్వంలో ఎందరో ఆత్మహత్యలు చేసుకున్నారని, ఇప్పుడు మీరు సీతక్క రాజ్యం, పోలీస్ రాజ్యం అంటూ ప్రచారం చేస్తే ప్రజలు నమ్మరన్నారు. మా పాలనలో ఎవ్వరిపై తప్పుడు కేసులు పెట్టలేదని నిజంగా పెట్టి ఉంటే లెక్కలు చూపించండి అంటూ ఆమె సవాల్ విసిరారు. ఉద్యమ సమయంలో జనాలను రెచ్చగొట్టి చనిపోయేలా చేసి మీరు మాత్రం అధికారం అనుభవించారంటూ దుయ్యబట్టారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ములుగులో కనీసం వేయి ఇండ్లు కట్టించి ఇవ్వలేదన్నారు. ఇక్కడ జరుగుతున్న అభివృద్ధిపై మీకు మాట్లాడే అర్హత ఉందా అంటూ నిలదీశారు. డిజిటల్ మీడియా వేదికల ద్వారా దుబాయ్ లాంటి ప్రాంతాల్లో స్టూడియోల్లో కూర్చుని తప్పుడు కథనాలు తయారు చేస్తున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న నీచరాజకీయాలను స్థానిక ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఇకనైనా పద్ధతి మార్చుకోవాలని సీతక్క హితవు పలికారు.

**వైఎస్ కు నివాళి..**

ములుగు జిల్లా కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖర్ రెడ్డి 76వ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భముగా మంత్రి సీతక్క వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాలులు అర్పించారు. మహానేత ఆంధ్ర రాష్ట్రానికి చేసిన సేవలు అమోఘం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణితో పాటు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, బ్లాక్, మండల, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ అడ్రస్ గల్లంతు

**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** కాళేశ్వరం అక్రమాలు ఒక్కొక్కటి బయటికి వస్తుంటే వాటిని కప్పిపుచ్చుకునేందుకు బీఆర్ఎస్ నేతలు అడ్డగోలు మాటలు మాట్లాడుతున్నారని డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క మల్లు ఆరోపించారు. పది సంవత్సరాల్లో లక్ష నుంచి రెండు లక్షల కోట్లు ఖర్చుపెట్టి పట్టుమని పది ఎకరాలకు కూడా నీళ్లు ఇవ్వని వారి అడ్రస్ స్థానిక ఎన్నికల్లో గల్లంతు కానుందన్నారు. బీఆర్ఎస్ నేతలకు డిపాజిట్లు కూడా దక్కవన్నారు. ప్రజలకు నిజాలు తెలుస్తున్నాయన్నారు. ప్రజా ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికి చేర వేసుకుంటూ కాంగ్రెస్ ముందుకు సాగుతోందన్నారు. బీఆర్ఎస్ నేతలు ఎక్కువగా ఊహించుకొని సీఎం రేవంత్ రెడ్డిపై అవాకులు, చెవాకులు పేలుతున్నారన్నారు. మంగళవారం మహబూబాద్ జిల్లాలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన అనంతరం సోమల తండాలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో డిప్యూటీ సీఎం ప్రసంగించారు. బీఆర్ఎస్ పాలనలో నీళ్ల విషయంలో తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఆధారాలతో పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా తెలియజేశారన్నారు. బేసిన్లు లేవు, భేశజాలు లేవు రాష్ట్రం ఏమైనా పర్వాలేదు కృష్ణా, గోదావరి నీటిపి వాడుకోండని పెద్దమనిషి కేసీఆర్ ఆంధ్రప్రదేశ్ లో ప్రకటన చేసిన విషయాన్ని వీడియోలతో సహా సీఎం రేవంత్ రెడ్డి ప్రజాభవన్ లో చూపించారన్నారు. కృష్ణా, గోదావరికి బేసిన్ ప్రాజెక్టుల్లో నీళ్ల గురించి లెక్కలతో సహా శాసనసభలో చర్చించడానికి సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఇప్పటికే చెప్పామని, అదే విషయాన్ని మరోసారి చెబుతున్నామన్నారు. పెద్ద మనిషి కేసీఆర్ చర్చకు రావాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి పెద్దమనిషి కేసిఆర్ కు సవాల్ విసిరితే.. దానిని స్వీకరించకుండా ఇంకొక ఆయన బయలుదేరాడని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి చెప్పింది వీరికి అర్థమవుతుందా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కొండా సురేఖ తదితరులు పాల్గొన్నారు.

# సైలెన్సర్లు మార్చితే క్రిమినల్ చర్యలు

## ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ ప్రభాకర్ రావు

**వరంగల్ వాయిస్, క్రైం :** ద్విచక్ర వాహనదారులు కంపెనీతో వచ్చిన సైలెన్సర్లలో ఎలాంటి మార్పు చేసిన వాహనదారుడితో పాటు మెకానికిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని వరంగల్ ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ ప్రభాకర్ రావు హెచ్చరించారు. మంగళవారం కేయూసీ జంక్షన్ ప్రాంతంలో పలు ద్విచక్రవాహన సైలెన్సర్లను రోడ్ రోలర్‌తో ధ్వంసం చేశారు. వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అదేశాల మేరకు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ద్విచక్ర వాహనాల కంపెనీ సైలెన్సర్ స్థానంలో అధిక శబ్దం వచ్చే సైలెన్సర్ల ఏర్పాటుపై ట్రాఫిక్ పోలీసులు ఉక్కుపాదం మోపారు. ఇందులో భాగంగా గత మూడు నెలల కాలంలో ట్రై సిటీ పరిధిలో నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో నిబంధనలు విరుద్ధంగా అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లు ఏర్పాటు చేసిన ద్విచక్రవాహనాలను గుర్తించి వాటి నుంచి మార్పు చేసిన సైలెన్సర్లను ట్రాఫిక్ పోలీసులు తొలగించాడంతో పాటు వాహన దారులకు కౌన్సిలింగ్ నిర్వహించి వెయ్యి రూపాయల చొప్పున జరిమానా విధించారు. ట్రాఫిక్ పోలీసులు తొలగించిన 461 సైలెన్సర్లను మరోమారు వినియోగించకుండా రోడ్ రోలర్ సాయంతో ధ్వంసం చేసారు. ధ్వంసం చేసిన సైలెన్సర్లలో హనుమకొండకు చెందినవి 275 కాగా కాజీపేట 111 వరంగల్ 75 ఉన్నాయి. అనంతరం ట్రాఫిక్ అదనపు డీసీపీ మాట్లాడుతూ ద్విచక్ర వాహనాల సైలెన్సర్లను మార్పు చేయడం చట్టరిత్యా నేరమన్నారు. శబ్ద కాలుష్య నియంత్రణతో పాటు ప్రజాఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని అధికంగా శబ్దం చేసే ద్విచక్రవాహనలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమములో ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, వరంగల్, హనుమకొండ, కాజీపేట ట్రాఫిక్ ఇన్స్పెక్టర్లు రామకృష్ణ, సీతారెడ్డి, వెంకన్నతో పాటు ఇతర ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

# దమ్మురెంటే చర్చకు రండి..

- ఫండ్స్ అన్నీ అధికార పార్టీ వారికే
- బీఆర్ఎస్ కార్పొరేటర్ల సవాల్

**వరంగల్ వాయిస్, బాలసముద్రం :** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ లో ప్రతిపక్ష కార్పొరేటర్ల గొంతు నొక్కుతున్నారని బీఆర్ఎస్ కార్పొరేటర్లు ఆరోపించారు. మంగళవారం బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్ మాట్లాడుతూ కౌన్సిల్ లో ప్రతిపాదించిన ఏజెండా అంశాలను ప్రస్తావిస్తే మేయర్ మా మైకులు కట్ చేస్తున్నారని ఆరోపించారు. కౌన్సిల్ లో వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై చర్చ జరిగినప్పుడు ఫండ్స్ అన్నీ కూడా కాంగ్రెస్ కార్పొరేటర్లకే కేటాయిస్తున్నారని ఆరోపించారు. దీన్ని బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. మీడియా సమావేశంలో 45 వ డివిజన్ కార్పొరేటర్ డాక్టర్ ఇండ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ భద్రకాళి చెరువు మీద చర్చ అంటే కాంగ్రెస్ నాయకులు భయపడుతున్నారని ఎద్దేవా చేశారు. చర్చ జరిగితే కాంగ్రెస్ అవినీతి బయటపడుతుందన్న భయంతో ఉన్నారన్నారు. భద్రకాళి చెరువును పూడుస్తూ, చెరువు విస్తీర్ణాన్ని తగ్గిస్తున్నారని



ఆరోపించారు. ఇటీవల చెరువులో ఒక వ్యక్తి చనిపోయిన ఉదంతాన్ని గుర్తు చేశారు. చెరువులో మట్టి పోసి చెరువును కట్టను రెండింటిని వేరు చేస్తున్నారని, ఖాళీ చేసినటువంటి భూమిని కొంతమంది కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. దాన్ని ఆపేందుకు ప్రయత్నించిన మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ ను అధికారులు, నాయకులు ఎందుకు అడ్డుకుంటున్నారో తెలపాలన్నారు. ఎయిర్ పోర్ట్ వచ్చిందంటూ ప్రకటించిన ముఖ్యమంత్రి, ఇతర నాయకులు సంబరాలు చేశారే తప్ప పని ఒక్క అడుగు కూడా ముందుకు సాగలేదన్నారు. స్మార్ట్ సిటీ కింద, హెరిటేజ్ కింద వరంగల్ కార్పొరేషన్ కు బడ్జెట్ కేటాయించిన పూర్తిస్థాయిలో ఎందుకు పనులు కావడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ కు సంబంధించిన వ్యక్తి జిల్లా స్పోర్ట్స్ అథారిటీలో కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు. అవినీతి చేసినటువంటి వ్యక్తికి స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి వత్తాసు పలుకుతున్నారని ధ్వజమెత్తారు. నాయకులకు సంపాదన మీద ధ్యాస తప్ప, నగర అభివృద్ధి మీద లేదన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం కొంతమంది డబ్బులు వసూలు చేస్తూ, అవినీతికి పాల్పడుతున్నారని, అర్హులైనటువంటి లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇల్లు అందకపోతే ప్రజాప్రతినిధులు, కలెక్టర్ల ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు బొంగు అశోక్ యాదవ్, చెన్నం మధు, సోదా కిరణ్, బోయినపల్లి రంజిత్ రావు, ఇమ్మడి లోహిత రాజు, సంకు నర్సింగారావుతోపాటు తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com